# భాగస్వామికి పింఛన్ భరోసా



- దంపతుల్లో ఒకరు మరణిస్తే మరొకరికి బదలాయింపు
- దరఖాస్తు చేసుకున్న పక్షం రోజుల్లో పంపిణీ
- నిబంధనలు సడలించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటి వరకు జిల్లాలో 892 మందికి లబ్ధి
- సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు

కలెక్టరేట్, అక్టోబర్ 3: గతంలో భార్యాభర్తల్లో ఒకరికి మాత్రమే వృద్ధాప్య పెన్షన్ వచ్చేది. పింఛన్ పొందుతున్న వ్యక్తి మరణిస్తే, ఆ జంటలోని భాగస్వామికి కష్టాలు మొదలయ్యేవి. తిరిగి పెన్షన్ రాక, కన్నవారు పట్టించుకోక నానా బాధలు తప్పకపోయేవి. అటు భాగస్వామి మరణం, ఇటు తన పోషణ తనకే భారమై ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉండేవారు. ఇరుగు పొరుగు ఆదరించినా కొద్ది రోజుల పాటు మాత్రమే కాగా, సమస్యల సాలెగూటి నుంచి తప్పించుకోలేక ఇంటి పెద్ద మరణించిన కొద్ది రోజులకే ఆ కుటుంబంలో ఉండే రెండో పెద్దమనిషి కూడా మంచాన పడడం సర్వసాధారణంగా మారింది. ఈ పరిస్థితులను గమనించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పెన్షన్ నిబంధనల్లో మార్పులు చేశారు. ఏవోపీ పెన్షన్ పొందుతున్న వృద్ధులు మరణిస్తే వెంటనే వారి భాగస్వాములకు దానిని బదలాయించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. పదిహేను రోజుల్లో భాగస్వామి పేరిట బ్యాంకులో డబ్బులు జమ చేయాలని సూచించారు. అయితే వృద్ధాప్యం లేకుంటే వితంతు పింఛన్ మంజూరు చేయాలంటూ సూచించడంతో, ఏడాది కాలంగా జిల్లాలోని వృద్ధ దంపతుల్లో ధీమా వ్యక్తమవుతున్నది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో పెన్షన్ కోసం నెలల తరబడి అధికారుల చుట్టూ తిరిగి, తిరిగి వేసారే పరిస్థితులు మారిపోయాయి. పెన్షన్‌దారు మరణించిన విషయం గ్రామంలోని పంచాయతీ కార్యదర్శికి సమాచార అందిస్తే చాలు, మిగతా తంతు అంతా ఆయనే చూసుకునేలా నిబంధనల్లో మార్పులు చేశారు. మరణించిన పెన్షన్‌దారు ఇంటికి వెళ్లి భాగస్వామి ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ సేకరించి, మరణ ధ్రువీకరణ పత్రం కూడా సిద్ధం చేసి, వీటిని మండల పరిషత్ కార్యాలయానికి కూడా పంపే బాధ్యతలు కార్యదర్శికే అప్పగించారు. దీంతో, వారం రోజుల్లో పూర్తి వివరాలను మండల పరిషత్ నుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు పంపుతారు. అక్కడ అధికారులు పరిశీలించి సత్వరమే భాగస్వామికి పెన్షన్ మంజూరు చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం పదిహేను రోజుల్లోనే ముగిసి, తదుపరి నెల నుంచి ఖాతాలో జమ అవుతుండగా, కోడళ్లు, కూతుళ్లు, కొడుకులు తమ ఆలనాపాలన చూసుకుంటారో లేదోననే మనోవేదన నుంచి దూరమవుతున్నారు. భాగస్వామి మరణంతో తమ జీవనం ముందుకు సాగుడెట్లా అనే బాధ నుంచి విముక్తి కల్పిస్తూ, మంజూరైన పెన్షన్ భరోసా ఇస్తుండగా ఆయా కుటుంబాల్లోని లబ్ధిదారులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. గత తొమ్మిది నెలల నుంచి ఈ విధానం జిల్లాలో అమలవుతుండగా, ఇప్పటి వరకు 892 మంది భాగస్వాములు మరణించిన వారికి పింఛన్ మంజూరు చేసినట్లు డీఆర్డీవో అధికారులు పేర్కొంటున్నారు.

### సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ నిర్ణయంతో పెన్షన్ పొందుతున్న వృద్ధుల భాగస్వాములకు సత్వరమే పెన్షన్ మంజూరు చేస్తున్నాం. ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలి. అర్హులు దరఖాస్తు చేసిన పదిహేను రోజుల్లో పింఛన్ మంజూరు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. -ఎల్ శ్రీలత, డీఆర్డీవో

# మొదలైన 'ఉపకార' ప్రక్రియ

- జిల్లాలో కొనసాగుతున్న దరఖాస్తుల పర్వం
- డిసెంబర్ నెలాఖరు వరకు గడువు

కలెక్టరేట్, అక్టోబర్ 3: జిల్లాలో పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల ప్రక్రియ మొదలైంది. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ పర్వం కొద్దిరోజులుగా కొనసాగుతున్నది. ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతూ ఆర్థికంగా వెనుకబడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఫీజు చెల్లింపుతో పాటు స్కాలర్‌షిప్ కూడా ప్రతి ఏటా అందిస్తున్నది. ఈ క్రమంలో ఈ విద్యా సంవత్సరం కూడా మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానించగా, విద్యార్థులు ఇంటర్నెట్ కేంద్రాల్లో అప్లై చేస్తున్నారు. డిసెంబర్ నెలాఖరు వరకు గడువు విధించినా, గతానుభవాల దృష్ట్యా విద్యార్థులు ముందుగానే దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకుంటుండగా, మరికొంత మంది ఇప్పటికే పూర్తి చేసి, సంబంధిత హార్డ్ కాపీలు తమ తమ కళాశాలల యాజమాన్యాలకు అందజేసినట్లు తెలుస్తోంది. వీరిలో అత్యధికంగా రెన్యువల్ చేసుకునే వారే ఉన్నట్లు సమాచారం. సాధారణంగా ప్రతి విద్యా సంవత్సరంలో జూలైలో ప్రారంభించి, సెప్టెంబర్‌లో ఈ కార్యక్రమం క్లోజ్ చేస్తారు. అయితే, వృత్తి విద్యా కోర్సుల కౌన్సిలింగ్ షెడ్యూల్ మారడంతో సెప్టెంబర్ మాసంలో కూడా ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆలస్యంగా కళాశాలల్లో చేరిన వారి కోసం పలుమార్లు దరఖాస్తుల గడువు పొడిగించాల్సి వస్తోంది. దీనికితోడు గడువు ముగుస్తున్న సమయంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటుండగా ఆన్‌లైన్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంటర్‌నెట్ కేంద్రాల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోతున్న వారంతా మళ్లీ చేసేందుకు విముఖత ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు వారు దూరమవుతున్నారు. దీనిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో దరఖాస్తుల గడువును డిసెంబర్ చివరి నాటికి ప్రకటించింది.

### పెరుగుతున్న దరఖాస్తుల సంఖ్య

పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. గత నెలలో ప్రారంభమైన ఈ పర్వం మందకొడిగా మొదలై, క్రమేపి ఊపందుకుంటున్నది. రెన్యువల్ చేసుకునే వారితో పాటు ప్రవేశాలు పొందిన వారంతా వెంటవెంటనే రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్ చేస్తుండడంతో ఎప్పటికప్పుడు పెరుగుతున్నట్లు సంక్షేమ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. కరోనా నేపథ్యంలో గత మూడేళ్లుగా వివిధ కోర్సుల్లో ప్రవేశాలు ఆలస్యంగా జరిగాయి. దీంతో దరఖాస్తుల స్వీకరణ కూడా ఆలస్యంగా మొదలైంది. గత విద్యా సంవత్సరంలో పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల గడువు మూడు పర్యాయాలు పొడిగించినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు నమోదు కాలేదు. జిల్లాలో 2020-21తో పోల్చితే కొత్త దరఖాస్తుల సంఖ్య కిందటేడు 35 శాతం తగ్గింది. రెన్యువల్ దరఖాస్తులు కూడా తగ్గుముఖం పట్టాయి. దీంతో ఈసారి ముందుగానే అవకాశం కల్పిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2022-23 విద్యా సంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీ విద్యార్థులు 20,468 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. 2023-24 విద్యాసంవత్సరానికి ఎస్సీ విద్యార్థుల నుంచి ఇప్పటి వరకు 3,429 రెన్యువల్స్, 2,172 ఫ్రెష్ దరఖాస్తులు రాగా, ఎస్టీ విద్యార్థుల నుంచి 941 రెన్యువల్స్, 382 ఫ్రెష్, బీసీ విద్యార్థుల నుంచి 2,416 రెన్యువల్స్, 695 ఫ్రెష్, మైనార్టీ విద్యార్థుల నుంచి 843 రెన్యువల్స్, 536 ఫ్రెష్ దరఖాస్తులు వచ్చినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే, ఈనెలలోనే పలు వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలు జరుగగా, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన వారంతా వచ్చే నెలలో దరఖాస్తు చేసుకునే అవకాశాలున్నాయని సంక్షేమ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

## మండలానికి చేరిన బతుకమ్మ చీరెలు

గంగాధర, అక్టోబర్ 3: రాష్ట్రంలోని మహిళలు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవడానికి వీలుగా ప్రతి సంవత్సరం ప్రభుత్వం బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్నదని. ఈ ఏడాది మండలంలో పంపిణీ చేయడానికి సర్కారు మంగళవారం తహసీల్ కార్యాలయానికి 12300 చీరెలను పంపించింది. కాగా, సిబ్బంది బతుకమ్మ చీరెలను వాహనం నుంచి దించి గ్రామాలకు పంపించారు.

లారీ లోంచి చీరెలను దించుతున్న సిబ్బంది →



## పశువైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 3: రాష్ట్రంలో పిండమార్పిడి పద్ధతి ద్వారా సాహివాల్ (దేశీయ) జాతి ఆవుల సంతతిని పెంచడానికి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాంచంద్రారెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలంలోని చెర్లభూత్కూర్ గ్రామంలో మంగళవారం కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, రాష్ట్రీయ గోకుల మిషన్ ద్వారా ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాంచంద్రారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పశువైద్యశాల డాక్టర్ కీర్తన, సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతి గౌడ్, కరీంనగర్ సింగిల్ విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, కరీంనగర్ డెయిరీ ప్రతినిధి ఎన్ ముత్యం రెడ్డి, రూట్ సూపర్‌వైజర్ గోపాల్, వీఎస్ సుమన్, చెర్లభూత్కూర్ పాల కేంద్రం నిర్వాహకుడు లింగంపల్లి ఓదెలు, రైతులు పాల్గొన్నారు.



గంగాధరలో సమావేశమైన కురుమ సంఘం నాయకులు

## అడ్ హక్ కమిటీ ఎన్నిక

గంగాధర, అక్టోబర్ 3: నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన కురుమ సంఘం నాయకులు మంగళవారం గంగాధరలో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కురుమల శంఖారావం సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సభ విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం శంఖారావం కమిటీ కన్వీనర్‌గా ఒగ్గు మల్లేశం, సభ్యులుగా ప్రతి మండలం నుంచి ముగ్గురిని ఎన్నుకున్నారు. కురుమ సంఘం మండలాధ్యక్షుడు దారె ఓదెలు, రాష్ట్ర కార్యదర్శి ఎలుకపెల్లి లచ్చయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి ఐలయ్య, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మీరాజం, ఎగుర్ల పోచయ్య, కోరె గట్టయ్య, భైరి బీరయ్య, పోలె గట్టయ్య, రాజు పాల్గొన్నారు.

## యువత దేశానికి మార్గదర్శకులుగా నిలువాలి



మాట్లాడుతున్న ఏఎస్ఐ గౌస్‌ఖాన్

రామడుగు, అక్టోబర్ 3: యువత సన్మార్గంలో నడుస్తూ దేశానికి మార్గదర్శకులుగా నిలవాలని ఏఎస్ఐలు గౌస్‌ఖాన్, అనంతరెడ్డి సూచించారు. రామడుగు మండలం గుండిలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన పోలీస్ కళాజాత కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంత యువత తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం పాటుపడుతూ, ఉన్నత చదువులను అభ్యసించి అత్యున్నత ఉద్యోగాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా పోలీస్ కళాబృందలు, ఏఆర్ఎస్ఐ ముల్కల కాంతయ్య ఇంద్రజాల ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. కళాబృందం సభ్యులు జానపద గీతాల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ గుండి ప్రవీణ్, పోలీస్ కళాబృందం సభ్యులు దేవేందర్, అజయ్, రవీందర్, శ్రీనివాస్, కిరణ్, రమేశ్, లక్ష్మణ్, సమ్మయ్య, హరీశ్ పాల్గొన్నారు.

## ఆందోళన చెందవద్దు

కొత్తపల్లి, అక్టోబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐఆర్ 5 శాతం విషయంలో ఉద్యోగులు ఎలాంటి ఆందోళన చెందవద్దని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఆర్‌తో పాటు ఇతర ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై మంగళవారం టీఎన్జీవోల కేంద్ర సంఘం అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కలిసి ఉద్యోగుల ఆందోళన, ఇతర అంశాలపై వినతిపత్రం ఇవ్వగా ఆయన సానుకూలంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, ఈహెచ్ఎస్‌కు సంబంధించిన అంశాన్ని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. టీఎన్జీవో సంఘానికి, ప్రభుత్వానికి మధ్య స్నేహపూర్వకమైన వాతావరణం ఉందని, ఉద్యోగులు తొందరపాటుకు గురికావద్దన్నారు.

## గజానన్ తామన్ మృతికి సాహితీ వేత్తల సంతాపం



గజానన్ తామన్ (ఫైల్)

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 3: తెలుగు, మరాఠీ, హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్, బెంగాలీ, గుజరాతి, సంస్కృత భాష పండితుడు గజానన్ తామన్ మంగళవారం ఉదయం మృతి చెందగా పలువురు సాహితీ వేత్తలు, కవులు సంతాపం వ్యక్తం చేశారు. గజానన్ తామన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మంథనికి చెందినవారు. గజానన్ చిత్రపటం వద్ద సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్త అనిల్ కుమార్, గండ్ర లక్ష్మణరావు, నలిమెల భాస్కర్, దాస్యం సేనాధిపతి, మాడిశెట్టి గోపాల్, వేణుశ్రీ, కేఎస్ అనంతాచార్య, అన్నవరం దేవేందర్, గాజుల రవీందర్, కలువకుంట రామకృష్ణ, గంగాధర్, గాజోజు నాగభూషణం, బీబీఎన్ స్వామి, జీవీ కృష్ణమూర్తి, దొమ్మాటి శంకర్, శ్రీకర్ నివాళులర్పించారు.